www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 15 ఫిబ్రవరి 2025
5
కాకినాడ



కొబ్బరి చెట్లకు బీమా పథకం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రకృతి వైపరీత్యాలు, తుపానులు, పిడుగులు, భారీ వర్షాలు, వరదగండ్ల కారణంగా కొబ్బరి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కొబ్బరి చెట్లకు బీమా సదుపాయం కలగజేసిందని మండల ఉద్యాన అధికారి ఎన్.సుజాత తెలిపారు. శుక్రవారం మండలంలోని కాండ్రకోట, మర్లావ, ఉలిమేశ్వరం, తిరుపతి, చదలాడ, తాటిపర్తి, దివిలి, చిన్న బ్రహ్మదేవం గ్రామాలు, పట్టణ పరిధిలోని కొబ్బరి తోటల రైతులకు బీమా పథకంపై అవగాహన కల్పించారు. 4 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన కొబ్బరి చెట్లకు బీమా వర్తిస్తుందన్నారు. బీమా ప్రీమియంలో 75 శాతం కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఒక్కొక్క చెట్టుకు రూ.3.50 మాత్రమే రైతులు చెల్లించాలన్నారు.

వెంటాడుతున్న కాలుష్యం

- యథేచ్ఛగా వ్యర్థ జలాలు విడుదల
- నిబంధనలు పాటించని పరిశ్రమలు
- మత్స్య సంపదకు తప్పని ముప్పు
- రోగాల బారిన స్థానికులు
- నిద్ర మత్తులో అధికారులు


కాకినాడ రూరల్ లో ఒక పరిశ్రమ నుంచి విడుదల అవుతున్న వ్యర్థ జలాలు (ఫైల్)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ బీచ్ బ్రహ్మాండంగా ఉంది. కానీ అక్కడంతా గలీజుగా ఉంది. అయినా జనం బాగానే వస్తున్నారు. ఇలాంటి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని ఇటీవల కాకినాడలో జరిగిన ఒక ప్రయివేటు సమావేశానికి వచ్చిన పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. అంటే తీరం ఎంత కాలుష్య కోరల్లో చిక్కుకుందో ఆయన వ్యాఖ్యలను బట్టి పరోక్షంగా అర్థమవుతుంది. ఇది ఆయన ఒక్క అభిప్రాయం మాత్రమే కాదు. తీరం అందాలను తిలకిద్దామని వస్తున్న పర్యాటకుల అభిప్రాయం కూడా ఇలానే ఉంది. కాకినాడ రూరల్ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల వలన తీరాన్ని కాలుష్యం వెంటాడుతోంది. ఇక్కడ అనేక పరిశ్రమలు ఉండగా వాటి నుంచి నిత్యం రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. దీంతో మత్స్యసంపద గణనీయంగా తగ్గిపోతుంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యాలతో సతమతమవుతున్నారు. యు. కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో హేచరీలు, రొయ్యల చెరువుల నుంచి వస్తున్న వ్యర్థాలతో మరింతగా తీరంలో కాలుష్యం పెరుగుతోంది. అడిగే నాథుడు, తీరప్రాంతాన్ని సంరక్షించే అధికారులు కనిపించకపోవడంతో అంతా మా ఇష్టం అన్న రీతిలో ఆయా పరిశ్రమల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి.

అల్లకల్లోలమవుతున్న తీరం

జిల్లాలో సముద్ర తీర ప్రాంతం 13 మండలాల్లో 144 కిలోమీటర్లు విస్తరించి ఉంది. తీరం వెంట లక్షలాది మంది మత్స్యకారులు మత్స్య సంపదను ఆధారంగా చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. కాకినాడ తీరంలో నిర్మించిన ఎరువుల పరిశ్రమలు, ఓడరేవు ఆధారంగా నెలకొల్పిన వంటనూనె కర్మాగారాలు, సముద్ర గర్భం నుంచి సహజ వాయువులు వెలికితీసే మూడు పరిశ్రమలు గత 25 ఏళ్లుగా తమ కార్యకలాపాలను సాగిస్తున్నాయి. అలాగే హేచరీలు ఉన్నాయి. ప్రధానంగా కాకినాడ రూరల్ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులు, ప్రమాదకర వ్యర్థ రసాయనాలతో తీరప్రాంతం అల్లకల్లోలం అవుతోంది. ఇక్కడ పర్యావరణం, సముద్రజలాల్లో మత్స్య సంపద, ఇతర జీవావరణాన్ని పూర్తిగా కలుషితం చేసేందుకు ఈ పరిశ్రమలే కారణమనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పలు పరిశ్రమలు వ్యర్థాలను సముద్రంలోకి యథేచ్ఛగా వదిలేయడంతో మత్స్య సంపద నాశనం అవుతుంది. మరోవైపు హేచరీలు ద్వారా వస్తున్న వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి వదులుతున్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా చాలా హేచరీలు సముద్రం ఒడ్డున నిర్మాణాలు చేపట్టారు. అక్కడి నుంచే ప్లాస్టిక్ పైపుల ద్వారా కలుషిత జలాలను నేరుగా విడుదల చేస్తున్నారు. హేచరీల్లో వచ్చిన నీటిని ఏమాత్రం శుద్ధి చేయకుండా వదులుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నల్లరంగులో ఉన్న వ్యర్థ జలాలు నేరుగా సముద్రంలోకి చేరుతుండడంతో కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. నిబంధనల ప్రకారం కలుషిత జలాలను శుద్ధి చేయాల్సి ఉంది. అవేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా నీటిని సంద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల సముద్ర జలాల్లో చిన్న చేపలు, గుడ్డు దశలో ఉన్న మత్స్యసంపద చనిపోతుందని ఆందోళన వ్యక్తం అవుతోంది. అధికారులుగానే నిబంధనలు అతిక్రమిస్తున్నా పట్టించుకునే వారే కనిపించడం లేదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

మత్స్యకారుల ఉపాధికి గండి

పరిశ్రమలు, హేచరీల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, రసాయనాలు నేరుగా సముద్రంలోకి కలుస్తుండడంతో సాగర తీరం పూర్తిగా కలుషితమవుతుంది. దీంతో మత్స్యసంపద దెబ్బతింటున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఫలితంగా వేలాదిమంది మత్స్యకారులు తమ ఉపాధిని కోల్పోతున్నారు. చేపల వేట తప్ప ఇతర వృత్తులు తెలీని మత్స్యకార కుటుంబాలు తమ జీవనాన్ని కోల్పోతున్నాయి. తీర ప్రాంతాన్ని వదిలి పెడితే బయట ఇతర పనులు చేయలేకపోతున్నామని వారు చెబుతున్నారు.

రోగాలతో సతమతం

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి, వలసపాకల గ్రామాల్లో ఉన్న రైస్ బ్రాన్ ఆయిల్ ఫ్యాక్టరీలు వదిలి పెడుతున్న పలు రకాల రసాయన మిళిత పొగవల్ల స్థానికులు కంటి చూపుకోల్పోతున్నారన్న ఆరోపణలు గత ఐదేళ్లుగా విన్పిస్తున్నాయి. ఇప్పటికే కొందరు కంటి చూపు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఎన్విరాన్మెంటల్ డిపార్ట్మెంట్కు ఇచ్చిన కెమికల్లైజ్ పొగ గాల్లో కలుస్తుండడంతో శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నారు. పొగ తీవ్రత తగ్గించి, గాల్లోకి వదిలేటప్పుడు ఎపిడెటిలో నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. గాలి నుంచి వస్తున్న దుమ్ము ధూళి చివరకు తినే ఆహారం, తాగే నీటిలో కూడా కలుస్తుండడంతో సూర్యారావుపేట, వాకలపూడి, మైనర్ పేట తదితర గ్రామాల్లో నివాసం ఉంటున్న స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే పరిశ్రమల నుంచి కాలుష్యం వెలువడకుండా చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖలు చోద్యం చూస్తున్నాయి. ఆరోగ్యరక్షణపై ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

స్వచ్ఛ ఆంధ్రా జయప్రదానికి కృషి


టెలీ కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ, కాజులూరు

ప్రతి నెలలో 3వ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ షాన్మోహన్ సగిలి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్లో మాట్లాడారు. శనివారం తాగునీటి వనరుల శుభ్రపరచడం, చెత్త తొలగించడం, వాటర్ స్టోరేజ్ ట్యాంకర్ వద్ద ఉన్న గార్బేజీను క్లీన్ చేయడం, డ్రైన్లలో ఉన్న చెత్తను తొలగించే కార్యక్రమం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు తగిన శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు శనివారం సోమవారం కూడా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో ప్రజల భాగస్వామ్యం ను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి 3వ శనివారం గ్రామాల్లో స్వచ్ఛ దివస్ స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గ్రామాల్లో ఎవ్వరూ సమస్య లు లేకుండా గ్రామ అభివృద్ధికి తోడ్పడా లన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు ఈశ్వరి, కె.సూరిబాబు, దంగేటి ప్రతాపకుమార్, రాజ్కుమార్, సుబ్బారాయుడు, హేమాదేవి, మహాలక్ష్మి, జహంగీర్ పాల్గొన్నారు.

రూ.5 కోసం కాంట్రాక్టర్ కక్కుర్తి..

-రూ.5.20 లక్షల జరిమానా విధించిన వినియోగదారుల ఫోరం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానంలో సెల్ఫోన్ భద్రపరుచుకునే ప్రయివేట్ కాంట్రాక్టర్ రూ.5కు కక్కుర్తి పడ్డాడు. దీంతో ఆ కాంట్రాక్టర్కు వినియోగదారుల ఫారం రూ.5.20 లక్షలు జరిమానా విధించి సంచలన తీర్పు ఇచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి...గత ఏడాది నవంబర్ 3న కాకినాడకు చెందిన న్యాయవాది జల్లిగంపల లక్ష్మీనారాయణ అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దర్శనం కోసం వెళ్లే క్రమంలో ఆలయంలోని సెల్ఫోన్ డిపాజిట్ కేంద్రంలో తన మొబైల్ను భద్రపర్చారు. స్వామి దర్శనం తర్వాత మొబైల్ తీసుకునేందుకు డిపాజిట్ కేంద్రం దగ్గరకు వెళితే డిపాజిట్ కేంద్రంలో రూ.10 చెల్లించాలని సిబ్బంది చెప్పారు. అక్కడ రూ.10 అని బోర్డుపై ఎందుకు రాయలేదని లక్ష్మీనారాయణ ప్రశ్నించాడు. అయితే వారి నుంచి సరియైన సమాధానం రాకపోవడంతో ఆ న్యాయవాధి ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో డిసెంబర్ 4న కాకినాడ జిల్లా వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేశారు.. అయితే రూ.5 వసూలు చేసేందుకే అనుమతి ఉన్నట్లు గుర్తించారు. విచారణ జరిపిన వినియోగదారుల ఫోరం సంబంధిత కాంట్రాక్టర్ దగ్గర నుంచి అదనంగా వసూలు చేసిన రూ.5తో పాటు, మానసిక క్షోభకు రూ.15 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని, అన్నవరం దేవస్థానానికి రూ.5 లక్షలు జరిమానా చెల్లించాలని ఫోరం అధ్యక్షుడు సిహెచ్.రఘుపతి వసంతకుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు తీర్పు ఇచ్చారు.

అంగన్వాడీల ధర్నాను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బేబీరాణి

ప్రజాశక్తి - సామర్లకోట

అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17వ తేదీన పెద్దాపురం ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యకురాలు జి బేబీరాణి తెలిపారు. శుక్రవారం పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలో 11 సెక్టార్ల సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17న జరిగే ధర్నాలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలంతా తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చర్చించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.నాగమణి, ఎస్తేర్రాణి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలి


శిక్షణలో మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకట్రావు

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 27న జిల్లాలో జరిగే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్సి పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని పట్టభద్రుల నియోజకవర్గ ఎఆర్ఒ, డిఆర్ఒ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో పిఒ, ఎపిఒ, సెక్టార్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో విధులు- పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ మెటీరియల్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, పిఒ డైరీ, టెండర్ ఓటు, సీక్రెస్సీ ఆఫ్ ఓటు, బ్యాలెట్ పేపర్ ఎకౌంటు, పోలింగ్ ఏజెంట్లు, మైక్రో అబ్జర్వర్ల విధులు, పోలింగ్ కేంద్రాలు, ఫర్నిచర్, విద్యుత్, పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానం వంటి అంశాలను ఎఆర్ఒ వెంకటరావు, ఆర్డిఒ ఎస్.మల్లిబాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్సి ఎన్నికలో 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, బ్యాలెట్ పత్రం బ్యాలెట్ బాక్సుల విధానంలో పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్లను కలెక్టరేట్ వివేకానంద హాలులో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూముకి తరలించేంత వరకు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు.

ఘనంగా సంజీవయ్య జయంతి



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్మోహన్

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ జె.వెంకటరావు, ఇతర అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల నిర్మాణంలో, పలు సంక్షేమ పథకాల అమలులో దామోదరం సంజీవయ్య చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా, కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో ఒక దళిత కుటుంబంలో మునెయ్య, సుంకులమ్మ దంపతులకు జన్మించారని ఆయన తెలిపారు. నిరంతరం ప్రజల క్షేమానికి పాటుపడిన సంజీవయ్య నిజాయితీగా, విలువలతో కూడిన పరిపాలన అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్వివి.సత్యనారాయణ, జడ్పి సిఇఒ లక్ష్మణరావు, ఎస్సి కార్పోరేషన్ ఇడి జె.సత్యవతి, బిసి సంక్షేమ అధికారి బి.లల్లీ, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు వై.వాణి, కె.రాధ, పిఎన్వి.సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ రామ్మోహన్రావు, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** సంజీవయ్య జయంతి వేడుకలను మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.పుల్లయ్య పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్, కార్యాలయ సిబ్బంది, బచ్చు ఫౌండేషన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాజీ సిఎం దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి ఎంపిడిఒ నాతి బుజ్జి, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా మట్టిని తరలించుకుపోతున్న మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ముస్లిం సంఘ నాయకులు కోరారు. శుక్రవారం ఈ మేరకు అన్నవరం పోలీస్స్టేషన్లో పలువురు ముస్లిం పెద్దలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జమాతే ముస్లిం సంఘం సెక్రటరీ అబ్దుల్ రహమాన్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. అన్నవరం పరిసర ప్రాంతాలలోని కొండలు, గుట్టలే గాక మట్టి మాఫియా సర్వే నెంబర్ 76లో ఉన్న తమ శ్మశాన వాటికను వదలడం లేదన్నారు. శ్మశాన వాటికలో 2 రోజుల క్రితం మట్టిని తవ్వుకు పోయారని, తమ బంధువులకు సంబంధించిన కలేబరాలు బయటపడ్డాయని తెలిపారు. శ్మశాన వాటికలో తవ్విన మట్టిని కొత్తపేట బ్రిడ్జి సమీపంలో నిర్మిస్తున్న పంచాయితీ షాపింగ్ కాంప్లెక్స్ పునాదిలో పూడ్చారని తెలిపారు. ఏడాది క్రితం పూడ్చిన మృతదేహం పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ పునాదిలో కన్పిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాల్పడ్డ మట్టి మాఫియా నిర్వాకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ముస్లిం సంఘం అధ్యక్షులు భాష, మసీదు అధ్యక్షులు అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు. ఫిర్యాదుపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హరిబాబు తెలిపారు.

రక్తదానంతో పలువురికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఎస్పి బిందుమాధవ్

ప్రజాశక్తి - కాకినాడ

రక్తదానం చేయడం ద్వారా ప్రమాదంలో ఉన్న మరొకరి ప్రాణాన్ని కాపాడిన వారం అవుతామని ఎస్పి జి.బిందుమాధవ్ అన్నారు. శుక్రవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నగరంలోని సంజయ్ నగర్లో ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఎస్పి పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం ప్రజలు మృతి చెందుతున్నారని అన్నారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న క్రమంలో రోడ్డు భద్రతకు సంబంధించిన నియమ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. ద్విచక్రవాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. జిజిహెచ్, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులకు శిబిరంలో సేకరించిన రక్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, జిల్లా రవాణా అధికారి కె.శ్రీధర్, ఎఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్, డిఎంహెచ్ఓ జె.నరసింహనాయక్, ట్రాఫిక్ సిఐ ఎన్.రమేష్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.మురళీకృష్ణ, రోడ్ సేఫ్టీ సభ్యురాలు బోడపాటి కాంతం, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, టీచర్ పావని, రవాణా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యం, పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దాపురం

నవోదయ విద్యాలయ పరిసరాల్లో ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ జరిగింది. శుక్రవారం జరిగిన ఈ ర్యాలీలో నవోదయ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేతుల పరిశుభ్రత వల్ల ఉపయోగాలు, ప్రాణవాయువైన ఆక్సిజన్ అందచేసే చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం వంటి అంశాలపై విద్యార్థులు వీధి నాటికను ప్రదర్శించారు.ఉపాధ్యాయులు పివి.రమణ స్వచ్ఛ భారత్పై గీతాలాపన చేశారు. నవోదయ ఇన్ఛార్జ్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పనసల సత్యనారాయణ, బి శర్వాణి, అనురాధ, కెవిబిఎస్.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేని ఫిబ్రవరిలోపు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ఎల్లమెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ కె.శ్రీనివాస్ తెలిపారు,. శుక్రవారం ఎల్లమిల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో రీ సర్వే ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ సర్వేను రైతుల సమక్షంలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్కుమార్, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థుల పఠనా సామర్థ్యం పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ పుల్లయ్య

ప్రజాశక్తి - సామర్లకోట

10వ తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను ఎంఇఒ-2 పి.పుల్లయ్య పరిశీలించారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. టీచర్ల లెసన్ ప్లాన్ తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. ఎండిఎంను స్వయంగా విద్యార్థులకు వడ్డించి నాణ్యతను పరిశీలించారు. ప్రతి విద్యార్థి భాష నైపుణ్యాలు, గణన నైపుణ్యాలు కలిగి ఉండేలా ప్రతి ఉపాధ్యాయులు చర్య తీసుకోవాలన్నారు. పాఠశాల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూన్'నిజం'



బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలను అందిస్తున్న జెవివి, మద్య నిషేధ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మద్యానికి బానిసై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యుకుడిని కుటుం బానికి మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జెవివి ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యాసరాలను పంపిణీ చేశారు. ఇటీవల మద్యానికి బానిసై పట్టణానికి చెందిన బర్రె శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో ధైర్యం చేసి బి.నవీన్ అనే యువకుడు ఆసుపత్రికి తరలించాడు. ఆసుపత్రిలో కోలుకుని తిరిగి ఇంటికి చేరిన శ్రీనును మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ, జన విజ్ఞాన వేదిక మండల గౌరవ అధ్యక్షులు దాడి పద్మనాభం, పిఠాపురం సిఐటియు నాయకులు కరణం విశ్వనాథం శుక్రవారం పరామర్శించారు. మద్యం వల్ల కుటుంబం విచ్ఛిన్నం అవుతాదని గమనించి మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆ కుటుంబానికి నిత్యాసరాలను పంపిణీ చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని ధైర్యం చేసి ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన నవీన్ను స్థానిక జూనియర్ కాలేజీలో పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జ్ ప్రిన్సిపల్ కె.పావని, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు గుర్రాల ప్రసాద్, జెవివి మండల అధ్యక్షులు ఏలేటి నానిబాబు పాల్గొన్నారు.


రైతు సేవా కేంద్రంలో నిరీక్షిస్తున్న రైతులు

మూగబోయిన సర్వర్లు..

ప్రజాశక్తి - సామర్లకోట

వివిధ పథకాలను ఆన్లైన్ చేసే క్రమంలో సర్వర్లు మొరాయించడంతో రైతులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నారు. పట్టణ పరిధిలోని భీమవరం, జగ్గమ్మగారిపేట ప్రాంతాలకు చెందిన రైతులకు మండలంలోని హుస్సేన్పురం గ్రామంలో రైతు సేవా కేంద్రంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును ఏర్పాటు చేశారు. శుక్రవారం పెద్దఎత్తున రైతులు ఈ కేంద్రానికి చేరుకున్నారు. అయితే అక్కడ సర్వర్ పనిచేయకపోవడంతో రైతులు గంటల తరబడి కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలంటే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని చెప్పడంతో రైతులు పనులు మానుకుని కేంద్రానికి వచ్చారు. తీరా సర్వర్ పని చేయకపోవడంపై రైతులు అసహనాన్ని వ్యక్తం చేశారు. సర్వర్ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో రమణక్కపేట రహదారిలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ముందస్తుగా వచ్చిన సమాచారంతో రమణక్కపేట రహదారిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో వాహనంలో తరలిస్తున్న 4 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ శివారు చెందుర్తి జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన గొర్ల గంగాధర్‌రావు తన పొలం పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై చెందుర్తి వెళుతుండగా 214 జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్‌రావు ఎగిరి కారు వెనకవైపు డిక్కీ మీద పడి తీవ్ర గాయాలు పాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు, పోలీసులు సంఘట స్థలానికి చేరుకుని అతనిని మేడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

నాటు సారా బట్టీపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మండలంలోని కోనపాపపేట శివారు జీడి తోటలో పిల్లి భూషణం అనే వ్యక్తి నాటు సారా బట్టీని నిర్వహిస్తుండటంతో పోలీసులు దాడి చేశారు. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. నిందుతుడిపై కేసు నమోదు కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు.

గుళికలు చల్లుతూ కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని పానింగపల్లి గ్రామంలో మోర్త నాని(28) అనే యువకుడు గుళికలు చల్లుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాణింగపల్లి గ్రామానికి మోర్త నాని తన తండ్రి ఆనందరావుతో కలిసి 4 ఎకరాలు పంట భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం గుళికలు మందులు చల్లేందుకు పోలానికి వెళ్లాడు. మధ్యాహ్నం పురుగుల ముందు వాసనకు తీవ్ర అస్వస్థతకు గుర్తై పడిపోయాడు. వెంటనే అతనిని పామర్రు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కరప

మండలంలోని యండమూరు గ్రామంలో కోడి కత్తితో ఒక వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు. ఈ నెల 8వ తేదీన యండమూరు గ్రామంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం రథం ఊరేగింపు నిర్వహించారు. కాపుల రామాలయం వద్దకు రథం వచ్చే సమయంలో ఈశ్వర ప్రసాద్ అనే వ్యక్తి బాణా సంచా జువ్వలు వేశాడు. అక్కడే ఉన్న మారెళ్ళ అజయ్, మరికొంతమంది నువ్వు కావాలనే మా మీదకు జువ్వలు వేస్తున్నావు అని గొడవకు దిగారు. గ్రామస్తులు అందరూ వాళ్ళకి సర్ది చెప్పి అక్కడ నుండి వారిని పంపించేశారు. ఈ నేపథ్యంలో 13వ తేదీన సాయంత్రం 6.40 గంటలకు వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరకు రమ్మని మారెళ్ళ అజయ్ జువ్వలు వేసిన ఈశ్వర్ ప్రసాద్‌ను పిలిచారు. తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఈశ్వర్ ప్రసాద్ గుడి దగ్గరకు వచ్చారు. తన స్నేహితులతో కలిసి కోడి కత్తితో ఈశ్వర్ ప్రసాద్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో ఈశ్వరప్రసాద్ గాయాల పాలయ్యాడు. దీంతో అతని స్నేహితులు ఈశ్వర ప్రసాద్‌ను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదానికి గురైన బాధితునికి పిహెచ్ సిలో వైద్యసేవలు అందిస్తున్న స్వీపర్ నాగమ్మ

ప్రమాద బాధితునికి స్వీపర్‌తో వైద్యం

ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కాట్రేనికోన

లక్ష్మివాడకు చెందిన చీకరుమిల్లి సూరిబాబు శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గుర్తై గాయాల పాలయ్యాడు. అతన్ని కాట్రేనికోన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వహించి బాధితుడి గాయాలకు క్లీనింగ్ నర్సు చేయకుండా స్వీపర్ (ఊడ్చే సిబ్బంది) మానుపాటి నాగమ్మతో గాయాలను శుభ్రం చేసినట్లు బాదితుడి బంధువులు ఆరోపిస్తున్నారు. కాట్రేనికోన ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గతంలో ఈ నర్సు ఒక చిన్న బాలిక కాలు నొప్పితో ఆసుపత్రికి వచ్చినప్పుడు నర్సు చేతితో కాకుండా తన కాలుతో బాలిక కాలును నొక్కి చికిత్స చేసిందని ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి సంఘటనల వల్ల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే స్థానికులు భయపడుతున్నారు. బాధితుల సదరు నర్సుపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సిబ్బందికి ప్రాథమిక వైద్య సేవల గురించి శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రాంతీయ ఆరోగ్య అధికారులు విచారణ జరిపి నిర్లక్ష్యంతో ఉన్న సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసిపిని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తాం

ప్రజాశక్తి - పిఠాపురం

వైసిపిని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. శుక్రవారం ఆయన పిఠాపురం వైసిపి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకంతో కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తల అందరి సహాయ సహకారాలు, సలహాలు, సూచనలు తీసుకుని వైసిపిని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తుందని, మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుని కూటమి ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుందని విమర్శించారు. న్యాయవ్యవస్థలపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం నియోజవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరు దొరబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఆదిత్య విద్యార్థులు

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ, పెద్దాపురం

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో పుల్వామా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బ్లాక్ డే చిత్రాన్ని గీసిన విద్యార్థులకు ప్రోగ్రాం ఆఫీసర్ టి.తేజేశ్వరరావు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ, అధ్యాపకులు పృథ్వీకృష్ణ, ఎల్ఎస్.వెంకటేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె పుల్వామా అమరవీరుల త్యాగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో దివిలి కిట్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు. అలాగే టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దివిలి గ్రామంలో పుల్వామా అమరవీరుల సంస్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్పంచ్ మోయిళ్ల కృష్ణమూర్తి, పులిమేరు సర్పంచ్ తుమ్మల నాని, రేలంగి బుజ్జి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యానాం వార్తలు



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

యానాంలో కాంగ్రెస్ నేతల పర్యటన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఎంపి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యలింగం, మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి, పుదుచ్చేరి సిఎల్‌పి నాయకుడు వైద్యనాథన్, పలువురు ఎంఎల్‌ఎలు శుక్రవారం యానాంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక కనకాలపేటలోని డంపింగ్ యార్డును వారు పరిశీలించారు. డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని కోరుతూ స్థానికులు ఎంపికి వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా డంపింగ్ యార్డును తరలించాలని కోరుతున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దొమ్మేటి పేటలో మురికి కాలువను పరిశీలించారు. స్థానిక ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద విద్యుత్ ఛార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. రంగస్వామి ప్రభుత్వం ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని తక్షణమే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక దవులూరి కాంప్లెక్స్ వద్ద జరిగిన బహిరంగ సభలో పలువురు స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రముఖ వ్యాపారవేత్త కాటంశెట్టి రామమూర్తి పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి నాయకులు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పొనుగుమట్ల విష్ణుమూర్తి, సబ్బతి శ్రీనివాసరావు, దుగ్గుదుర్తి అనిత తదితరులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్, విళ్ల చిన్ని, ప్రసాద్‌రాజు, చీకట్ల రామకృష్ణ, దవులూరి పతి, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

పశువుల ఆసుపత్రిలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - యానాం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ గవర్నమెంట్ ఐటిఐ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు శుక్రవారం స్థానిక పశువుల ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొని వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్ పాల్గొన్నారు.

పలువురికి పెళ్లి కానుకల అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలో శుక్రవారం వివాహం చేసుకున్న పలువురికి టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పెళ్లికానుకలను అందజేశారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ తరుపున నియోజకవర్గంలో వివాహం చేసుకుంటున్న పెళ్లి కుమార్తెకు రూ.20 వేలు అందజేయడం విధితమే. ఈ నేపథ్యంలోనే శుక్రవారం గండేపల్లి మండలంలో నలుగురికి, జగ్గంపేట మండలంలో ఇద్దరికీ, కిర్లంపూడి మండలంలో ముగ్గురికి, గోకవరం మండలంలో ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున రూ.2.40 లక్షలను ఆయన అందజేశారు. ఒకేరోజు 14 మంది పెళ్లికుమార్తెలకు అందజేయడం రికార్డుగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఆడబిడ్డ పెళ్లి చేసుకుంటే తొమ్మిది రోజుల ముందు స్థానిక జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బద్ది సురేష్, చదరం చంటిబాబు, బుర్రి సత్తిబాబు, అనుకూల శ్రీకాంత్, ముర్రి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



పెళ్లి కుమార్తెకు చెక్కును అందిస్తున్న జ్యోతుల నవీన్



విజేతకు బహుమతిని అందిస్తున్న నిర్వాహకులు

ఉత్సాహంగా లేగ దూడల పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని జి.రాగంపేటలో లేగ దూడలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆ గ్రామ రైతులే కాకుండా పరిసర గ్రామాల రైతులు తిలకించారు. పోటీలు అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు లేగ దూడలను ఎంపిక చేశారు. నాలం వీరభద్రరావు (ప్రథమ), బాసర కృష్ణ (ద్వితీయ), మలిరెడ్డి దుర్గ (తతీయ)లకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్నేతగా కిర్లంపూడి పశు వైద్యాధికారి డాక్టర్ వెన్నా వినోద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంబేద్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ తుమ్మల రామస్వామి, డాక్టర్ మస్తాన్‌బీ, బి.ప్రసాద్, కె.కోటి, పుష్పరాజు, పి.ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

వికలాంగుల గుర్తింపు కోసం ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - పిఠాపురం

నియోజవర్గంలో వికలాంగుల గుర్తింపు కోసం ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్యానల్ లాయర్లు, పారా లిగల్ వాలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు రోజువారిగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఏ విధమైన గుర్తింపు ఇస్తున్నాయి, ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తుంది? వారికి ఏ విధమైన సౌకర్యాలు కావాలి అనే అంశాలపై సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకు గొల్లప్రోలు మండలంలో కొడవలి, తాటిపర్తి, పిఠాపురం మండలంలో కోలంక గోకివాడ, ఎల్ఎన్.పురం, జగపతిరాజపురం, మాధవపురం, కొత్తపల్లి మండలంలో నాగులపల్లి, ఉప్పాడ తదితర గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేశారు. ఈ నెల 24వ తేదీలోపు ఈ సర్వే పూర్తి చేయవలసి ఉందని కోర్టు సిబ్బంది తెలిపారు.

బాలునికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన నవీన్ అనే బాలుడుకు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో స్థానిక సెయింట్ థామస్ పాఠశాల యాజమాన్యం సమకూర్చిన నగదును శుక్రవారం బాలుడు కుటుంబ సభ్యులకు పాఠశాల కరస్పాండెంట్ డి.దేవసుకుమార్ అందజేశారు ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి బాలుడు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

16న ఉచిత వైద్య సేవా శిబిరం

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని మొగలికుదురు సత్యసాయి కళ్యాణ మండపములో సత్యసాయి సేవాసంస్థ ల ఆధ్వర్యంలో ఈనెల 16న ఆదివారం ఉచిత వ్యాస్కులర్ వ్యాధుల వైద్య శిబిరం ఏర్పాటు చేశామని సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రూ. 4,500 విలువచేసే కలర్ డాప్లర్ ఆల్ట్రా సాండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని ఆయన తెలిపారు. రోగులు దీనినిసద్వినియోగం చేసుకోవాలని కోరారు

'ఎన్ఎంఎంఎస్'లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఈ ఏడాది జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో డాక్టర్‌బిఆర్.అంబేద్కర్‌కోనసీమ జిల్లాలో జడ్‌పి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ఉప్పలగుప్తం: మండంలోని గొల్లవిల్లి జడ్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించారు. విద్యార్థినులు దూనబోయిన లలితా మణి ప్రియ, సవరపు రష్మిత, నేతల జెస్సికలను శుక్రవారం ఆ పాఠశాలలో ఎంఇఒలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, ఎస్ఎంసి ఛైర్మన్ వాలా సత్యనారాయణ, హెచ్ఎం ఎల్.రాణి ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని చల్లపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి గెద్దాడ సన్ని, ఉప్పలగుప్తం పేరాయి చెరువు ఎంపియుపి పాఠశాల విద్యార్థి పండు వినోద్ కుమార్ లు కూడా ఎన్ఎంఎంఎస్ పరీక్షలో విజయం సాధించి జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. **కె.గంగవరం:** జాతీయస్థాయి లో జరిగిన స్కాలర్ షిప్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి కె.గంగవరం చెందిన పలివెల మహాలక్ష్మి ఎంపికైంది. మొత్తం కె.గంగవరం మండలం నుంచి ఐదుగురు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు నండూరి భీమరాజు తెలిపారు. కె.గంగవరం హైస్కూల్ విద్యార్థిని ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు మహాలక్ష్మిని అభినందించారు. **రావులపాలెం:** మండలంలోని ఈతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లంకె దినేష్, అడగళ్ళ బిందు లక్ష్మీప్రియ, షేక్ ఆయేషా, కోసూరి సుగుణ, సిహెచ్. లక్ష్మీప్రియ, వల్లపురెడ్డి దీపిక, ఏపుగంటి సంజన కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్షిప్ కు సెలెక్ట్ అయ్యారని హెచ్ఎం కెఎస్‌వి.కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలో 14 మంది విద్యార్థులు సెలెక్ట్ కాగా అందులో సగం మంది ఈతకోట హై స్కూల్ నుండి ఎంపిక కావడం విశేషమన్నారు. విద్యార్థులు పలువురు అభినందించారు.

సంజీవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య 104వ జయంతిని జిల్లాలో పలు చోట్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు.

అమలాపురం: స్థానిక కలెక్టరేట్ నందు దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. జెసి టి.నిషాంతి ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ సంజీవయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దామోదరం సంజీవయ్య జయంతి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వ:హిఇంచారు. ఈ సందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, మహబూబ్ షకిల, జోగి అర్జున్ రావు, పేరి శర్మ, ఏలేశ్వరపు రాధాకష్ణ, మొల్లేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **రాజోలు:**సఖినేటిపల్లి మండలం సంజీవయ్య కాలనీ లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని కాలనీవాసులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలనీలోని సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య చేసిన సేవలను కొనియాడారు. జోహార్ సంజీవయ్య అంటూ నినాదాలు చేశారు. దళిత ముఖ్యమంత్రి పేరు పై సంజీవయ్య కాలనీ ఏర్పడడానికి ఆయన పేదలకు చేసిన సేవలే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సంజీవయ్య కాలనీ సంఘ ప్రెసిడెంట్ కె.రాజీవ్‌భూషణ్, జె.కుమారరత్నం, పి.రాజ్ కుమార్, డి.రాజ్ కుమార్, డి.బాబూరావు , ఎన్ బాలరాజు, కె.రత్నరాజు, కె.విజయరత్నం, డి. సువర్ణరత్నం, టి.రత్నరాజు, ఎన్.నవీన్, జి.విల్లింగ్టన్, జె.సుశీల్‌కుమార్, సంఘ సభ్యులు యూత్ సభ్యులు పాల్గొన్నారు .**ముమ్మిడివరం:** నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బాలయోగి కాలవ రోడ్ నందు వడ్డీ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో శుక్రవారం దామోదర సంజీవయ్య జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముషిని శివ ప్రసాద్, గోడి భాస్కర రావు, గుబ్బల రవి, ఎంటి.ప్రసాద తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సామర్లకోట

గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే అప్రమత్తంగా ఉండాలని సిఐ కృష్ణభగవాన్ సూచించారు. ఇటీవల తమ కాలనీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు కాలనీ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పిఠాపురం రోడ్‌లో ఉన్న టిడ్కో కాలనీ ప్రాంతాన్ని సిఐ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ వాసులతో మాట్లాడుతూ ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అలాగే గృహాలలో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు అద్దె కొరకు వచ్చిన వారి గురించి సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణానికి దూరంగా ఉన్న గృహాల వద్ద నివసిస్తున్న ప్రజలు భయపడకుండా దైర్యంగా ఉండి తమ సహాయం పొందాలని తెలిపారు.

చురుకుగా సమిత్వ సర్వే

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలో మోడల్ గ్రామా లుగా గుర్తించిన పోచవరం, ప్రక్కిలంక గ్రామాల్లో సమిత్వ సర్వే నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ రమణ తెలిపారు. ఈ సర్వేలో భాగంగా ప్రతి ఇంటి స్థలాలను రోవర్, సాటిలైట్ ద్వారా కొలతలు చేసి ఇంటి సరిహద్దులు సేకరిస్తారని ఎంపిడిఒ తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న ఈ సర్వేను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి అమ్మాజీ, డివిజనల్ పంచాయతీ అధికారి శాంతామణి పరిశీ లించారు.

వీర జవాన్లకు ఘన నివాళి

ప్రజాశక్తి - కొత్తపేట

పూల్వామాలో 2019 ఫిబ్రవరి 14న సైనికులను తీసుకువెళ్తున్న వాహనాల కాన్వాయ్ మీద కారుతో ఆత్మాహుతి బాంబు దాడి ఘటనలో మతి చెందిన జవానులకు కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శుక్రవారం నివాళులు అర్పించారు. కొత్తపేట బండారు బులిసత్యం చంద్రావతి కాపు కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జిల్లా టిడిపి అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, బండారు సంజీవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవానులను గుర్తు చేసుకుంటూ వారికి నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు .సైనికులు లేనిదే దేశ సరిహద్దులో రక్షణ లేదని సైనికుల త్యాగాలను సత్యానందరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పెనుగుదురులో బంగారం చోరీ

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు గ్రామంలోని తాళం వేసి ఉన్న ఇంటిలోని బంగారం నగలు దొంగలు చోరీకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పబ్బినీడి అప్పారావు దంపతులు ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 2.00 గంటలకు పాయకరావు మండలం సత్యవరం గ్రామం పెళ్ళికి వెళ్లారు. ఈనెల 13వ తేదీన 10.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి మెయిన్ డోర్ తెరిచి ఉండటంతో లోనికి ప్రవేశించి పరిశీలించగా బట్టలు చిందరవందరగా పడేసి, తాళం వేసి ఉంచిన బీరువాలో ఉన్న బంగారం వస్తువులు ఎత్తుకుపోయినట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - చాగల్లు

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి మండలంలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తహశీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. చాగల్లు మండలంలో 2629 ఓటర్లు ఉన్నారని ఆమె తెలిపారు.